# భగ్నవీణ

ఈ వివాహ బంధం ఎంత విభిన్నమైన ప్రకృతులని చిత్రంగా ముడివేసి ఒకచోటికి చేరుస్తుందో! తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తోంది.

మరీ ఆశ్చర్యం ఏమంటే నిత్యానందం ఎవరికీ చెప్పకుండా హఠాత్తుగా పెళ్ళి చేసుకోటం! అందులో తన దగ్గర చదువుకునే విద్యార్థిని సరోజినినే వరించి వధువుగా చేసుకోటం...

బంధు మిత్రులే కాకుండా అందరూ విస్మయంతో ఉక్కిరి బిక్కిరై తన్నుకున్నారు. ఎందుకంటే నిత్యానందం అసలు పెళ్ళాడుతాడని కలలోకూడా ఎవరూ అనుకోలేదు. ఎప్పుడూ ఏదో జిజ్ఞాసతో ఎక్కడో విహరిస్తున్నట్లుగా వుండేవాడు. ఒకటికి రెండుసార్లు పిలిస్తేకాని పలకనంతటి పరాకు మనిషి. ఏం గుడ్డలు తొడుక్కుంటున్నాడో, ఏం తింటున్నాడో కూడా తెలియనంతటి పరధ్యానంలో మునిగి తేలుతూ వుంటాడు. ఉంగరాలు తిరిగిన జుట్టు, ఎప్పుడూ ఇష్టంవచ్చినట్లు గాలిలో గంతులేస్తూ వుండేది. కాని దువ్వెనకి దాస్యంచేసి ఎరగదు. గదిలో కొండల గుట్టల్లాగా పుస్తకాల దొంతరలు తప్ప ఇంకేమి కనబడేవికావు. వాటి పుటల్లోనే నిత్యానందం దళసరి అద్దాల్లోంచి చురుకుగా చూసే కళ్ళతో పరిగెత్తుతూ వుండేవాడు. పుస్తకాలు తప్ప ఇంకో లోకమే లేదు అతనికి.

కాలేజీలో పనిచేసేటప్పుడు కూడా తామరాకు మీద నీటి బొట్టులాగా జారిపోతూవుంటాడు. ఎవరితోనూ నవ్వుతూ, పేలుతూ బాతాఖానీ కొట్టడు.

అటువంటి నిత్యానందం అమాంతంగా గృహస్థు అయ్యాడని వినగానే, అంతా బిత్తర పోయారు. అందులో అతను చేపట్టిన అర్ధాంగి అన్ని విషయాల్లోనూ పూర్తిగా భిన్నమైన ప్రకృతి కలదని అందరికీ తెలిసిన సంగతే. ఆ కళాశాలలో చదివే యువతులందరిలోకీ సరోజిని రూప యౌవన విలాసిని. సీతాకోక చిలుకలాగా రోజు కొక రంగు వలువలతో కాలేజీ అంతా ఎక్కడ చూసినా కనిపించేది. చర్చల్లో, నాటకాల్లో, సభల్లో సరోజిని జగన్మోహినిలాగా సాక్షాత్కరించేది. జల జలపారే సెలయేరులాగా కిలకిల నవ్వుతూ వుండేది. నడిచినా, కదిలినా, పలికినా ఎంతో ఒయ్యారం వెల్లవిరిస్తూ వుండేది. పాదరసంలాగా, మెరపు తీగలాగా సరోజిని యౌవన లావణ్యంతో, మిసమిస లాడుతూ తేలిపోతూ వుండేది.

నిజం, ఆ సరోజినే నిత్యానందానికి అర్ధాంగి కావటానికి అంగీకరించింది. ఆమె తండ్రి కలెక్టరు చేసి పింఛను పుచ్చుకున్న శివరామప్రసాదుగారు, ఈ సంబంధాన్ని కుదిర్చి ఎంతో ముచ్చటగా పెళ్ళిచేశారు. పరధ్యానం మాష్టరుగారికి భార్య కావటానికి సరోజిని ఎల్లా ఒప్పుకుందో, ఎందుకు సమ్మతించిందో ఎవరికీ తెలియదు.

కనీసం ఇద్దరి మధ్యా ఒక్క ప్రేమలేఖ కాని, ఆఖరికి ఒక్క మేఘ సందేశం కాని నడవలేదు. సిరి సంపదలూ, అంద

చందాలూ కొల్లలుగా వున్న సరోజిని, ఇంతకంటే మంచి సంబంధం దొరకలేదనే భయంతో అంగీకరించిం దనుకోటానికి ఆస్కారం లేదు.

అయినా ఈ తర్కంవల్ల తేలేది ఏముంది ? ఇంతకీ ఆ ఘడియ తోసుకొచ్చేసింది. ఆపలేని వేగంతో విధి తుపాను గాలిగా వాళ్ళిద్దర్నీ కళ్యాణ వేదిక మీదికి నెట్టుకు వెళ్ళింది.

అంతే, ఎంతో వైభవంగా జరిగింది వాళ్ళ వివాహం.

## 2

పెళ్ళి కాకముందు, యువతీ యువకుల కళ్ళకి ఏదో మైకం కమ్మి లోకాన్ని ఇంద్ర ధనస్సు రంగులతో నింపేస్తుంది. సంరంభం అంతా అణగిన తరువాత రోజురోజుకీ జీవితపు అసలు రూపం బైటపడుతూ వుంటుంది. గొప్ప షాపుల్లో, పాదరసపు దీపాల మాయ వెలుగుల్లో మెరిసిపోయిన చీరె బైటికివచ్చి ఎండపొడలో చూడగానే వెలవెల పోయినట్లు, పెళ్ళి ముందరి కలలన్నీ కాపురం పెట్టగానే మటుమాయమై పోతయ్. ఆనంద శిఖరాలమీదినించి తరుణ హృదయం అమాంతం కిందికి జారిపోతుంది. వాస్తవ జీవితపు నిర్దాక్షిణ్యమైన వాడి వెలుతురు, ప్రేమ కలకల పొగ మంచుని తరిమి వేసేదాకా వూరుకోదు !

కాపరానికి వచ్చిన నెల లోపుగానే సరోజిని కళ్ళకి కమ్మిన పొర విచ్చిపోయింది. తను భర్తగా వరించిన వ్యక్తికీ,

తనకీ తూర్పు పడమరల కున్నంత వ్యత్యాసం వుందనే సత్యాన్ని గుర్తించి, హృదయం ఎంతో గాయపడింది. నిత్యానందంలో అంద చందాలు అట్టే లేవనీ, అందరిలాంటి మనిషి కాడనీ పెళ్ళికి ముందే తెలుసు. అదోరకంగా వుండే ఆ మనిషి మెడకి తన ప్రేమపాశం బిగించి, నలుగురూ నడిచే దారిలోకి గుంజుకు రాగలననే ధీమాతో ఈ పెళ్ళికి ఒప్పుకుంది. తెలియని దారిలో అడుగు పెట్టాలని, చీకటిలోకి ఉరకాలని యువ హృదయం సాహసంతో ఉవ్విళ్ళూరుతుంది. అటువంటి సాహసమే సరోజినిని ఈ పెళ్ళికి పురికొలిపింది. అంతేకాదు. నిత్యానందం తెలివి తేటలు పదును కత్తిలాగా 'తళ తళ' మెరుస్తూ ఆమెని మిరుమిట్లు కొలిపినయ్. మనుషుల్లో అంతటి మేధావి కోటి మందిలో ఒకడు వుంటాడనే గర్వంకూడా ఆమెకి కలిగింది.

కాని క్షణక్షణమూ జీవితం సంఘర్షణతో, సంక్షోభంతో ఇంత దుర్భరమై పోతుందని ఆమె కలలో కూడా అనుకోలేదు! కలల అలలన్నీ కఠిన సత్యాల శిలలకి ఢీకొని ముక్కలై పోయినయ్.

చిన్న వాటా అద్దెకి తీసుకుని ఒంటరి కాపరం ఆరంభించారు కొత్త దంపతులు. నిత్యానందానికి తనవైపు వాళ్ళెవరూ లేరు. అతని చదువు ముగిసేనాటికే తల్లీ తండ్రీ ఇద్దరూ మరణించారు. ఉద్యోగం దొరికిన మూడేళ్ళనించీ కాలేజి దగ్గరే ఒక సందులో చిన్న గదిలో అద్దెకి వుంటున్నాడు. ఇప్పుడు ఆ గది వదిలేసి మూడు గదుల వాటా అద్దెకి తీసుకున్నాడు.

మామగారికి సరోజిని ఒక్కర్తే కూతురు. చిన్నప్పుడే తల్లి పోవటం వల్ల తల్లీ తండ్రీ తనే అయి కంటికి రెప్పగా పెంచి పెద్దదాన్ని చేశాడు. పెద్ద బంగళా అంత ఇల్లున్నప్పటికీ ఎంత బతిమాలినా అల్లుడు అక్కడ వుంటానికి ఒప్పుకోలేదు. మూడు గదుల వాటాలో తన అల్లారు ముద్దు కూతురు కాపురం చెయ్యాల్సి వచ్చేసరికి తండ్రికి చాలా కష్టం వేసింది. అల్లుణ్ణి గురించి తను వేసుకున్న అంచనాలు తారుమారు కావటానికి అదే మొదలు.

ఇల్లు ఇరుకైనా దాన్నే ఎంతో ముచ్చటగా తీర్చి దిద్దుకోవాలని సరోజిని ఎంతో సరదా పడింది. ముందు గదిలో కనీసం ఒక సోఫాసెట్టు, నాలుగు కుర్చీలు, మంచి టేబులూ, దానిమీద పూలతొట్టీ, తలుపులద్వారానికీ, కిటికీలకీ రంగుల తెరలూ, పుస్తకాలకి చక్కటి అద్దాల బీరువా అమర్చాలని ఆశ పడింది. ఎన్నిసార్లు చెప్పినా నిత్యానందం మౌనముద్ర విడవటం లేదు. ఒక తుంగచాప పరుచుకుని, గోడకి ఆనుకుని కూర్చుని గంటల తరబడి అల్లాగే చదువు కుంటూ వుంటాడు. వెన్నులో పోటు రాదా? పోనీ తన సుఖమైనా ఎందుకు చూసుకోడో? తన తండ్రి కానుకగా ఇచ్చిన పందిరి మంచాలు తిప్పి పంపేదాకా భర్త తనతో మాట్లాడలేదు. ఎంత మెత్తగా వుంటాడో అంత గట్టిపట్టుదల వుంది మనిషిలో. అందుకే ఏ పని చేయటానికైనా సరోజినికి అంత జంకు. మరీ అదేపనిగా వెంటపడితే ఒకసారి పుస్తకాల లోంచి తల పైకెత్తి "నేను కలెక్టర్ని కాదు. కాలేజీ

ప్రొఫెసర్ని. ఈ సంగతి కాస్త గుర్తుంచుకో!" అన్నాడు. సరోజిని ఉత్సాహం కాస్తా, తప్పున పగిలిన రబ్బరు బెలూను లాగా నేల కూలిపోయింది.

సరోజిని కాలేజిలో చదివే రోజుల్లో తన సౌందర్య జ్వాలతో ఎన్ని హృదయాలనో రగిలించింది. ఒక్క కటాక్ష వీక్షణం ప్రసరిస్తే చాలు, ఎందరో జన్మంతా బానిసలై దాస్యం చెయ్యటానికి సిద్ధపడేవాళ్లు. ఎన్ని తరుణ హృదయాలో ఆమె కోమల చరణాలమీద పూజా ప్రసూనాలుగా వాలటానికి పరితపించేవి. అటువంటి లావణ్యం, భర్త నోటినుంచి ఒక్క ప్రశంసని కూడా సంపాదించుకోలేక చిన్నబోతోంది. చేతికి అందిన నిక్షేపం ఎంత విలువయినదో గుర్తించలేని మూర్ఖులు లోకంలో చాలామంది వుండవచ్చు. కాని తన భర్త ఆ తరగతికి చెందడే? మరి ఎందుకింత ఉదాసీనభావం? తను లేకపోయినా భర్త జీవితం ఏ కొరతా లేకుండా ఇల్లాగే పుస్తకాల పేజీలలో పరుగెత్తుతుంది. తను దగ్గర వుండి పరి చర్య చేస్తూవున్నా, తన సాహచర్యంలో ప్రేమ మధువుని కురిపిస్తున్నా కొంచెమైనా గుర్తించనట్లే నిత్యానందం జీవిస్తు న్నాడు.

తటపటాయించి, అయినా కాదంటాడా అనే నమ్మ కంతో ఒక సాయంకాలం సరోజిని భర్తని 'సినిమాకి వెళ్దాం రండి!' అని పిలిచింది. నిత్యానందం పర్సులోంచి అయిదురూపా యల నోటుతీసి ఇచ్చి "ఇదిగో? నువ్వు వెళ్ళు" అని మళ్ళీ పుస్తకంలో మునిగిపోయాడు.

"మీరు కూడా రాకూడదా? సరదాగా వెళ్ళివద్దాం. ఈచదువు రోజూ వుండేదేగా? రండి!" అని కొంచెం చనువుగా, బలవంతం చేస్తున్నట్లుగా అన్నది సరోజిని.

కొంతసేపటిదాకా నిత్యానందం మెదలకుండా వూరు కుని చివరికి "నాకు ఆసక్తి లేదు. నీ సరదాలకి నేను అడ్డు రాను. తప్పకుండా వెళ్ళు" అన్నాడు.

అయిదు రూపాయలనోటు అక్కడే జారవిడిచి, సరోజిని వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది. కమ్ముకు వస్తున్న సంజ చీక టితో ఆమె మనస్సుకూడా అలముకుపోయింది. ఆవేగంతో వణికే కింది పెదిమని పళ్ళతో కరిచి పట్టుకుని, లోపలినుంచి పొంగివచ్చే ఆక్రోశాన్ని అణుచుకుంది. కాటుకకళ్ళ కొనల లోంచి చెక్కిళ్ళ మీదుగా వెచ్చటి కన్నీటి చుక్కలు జారు తున్నయ్. మధుర సంగీతంగా మారుమోగుతుందని కలలుకన్న బతుకులో ఎందుకీ భరించలేని అపశ్రుతులు? తన తరుణ హృదయంలో ఉరకలువేసే ఉత్సాహమంతా నిత్యానందం నిర్లిప్తవైఖరికి ఇంకిపోవలసిందేనా? తీరని కోరికలతో తన హృదయం దహించుకు పోవలసిందేనా?

ఇంకోరోజు, సరోజిని తనతో కాలేజీలో చదువుకున్న స్నేహితురాలు మనోరమ వస్తే, తమయింటికి విందుకి పిలిచింది. మనోరమ భర్త మిలిటరీ ఆఫీసరు. సెలవుమీద ఆ వూరు వచ్చారు. పొరుగింట్లో వున్నప్పటికీ వాళ్ళిద్దరూ ఎంతో ఆప్యా యంగా వున్నారు. ఒకళ్ళ నొకళ్ళు 'డార్లింగ్!' అని సంబోధించు కున్నారు. ఒకళ్లమాటల నొకళ్లు వెన్నెలని తాగే చకోర

పక్షుల్లాగా ఆస్వాదిస్తున్నట్లు కనిపించారు. మనోరమ మెళ్లో మెరుపుతీగలాగా తళుక్కుమనే నెక్ లెస్, చెక్కిళ్లమీద లేత వెన్నెలలు చిమ్ముతూ మెరిసే రవ్వల దుద్దులూ...చదువుకునే రోజుల్లో చినిగి మాసికలు వేసుకున్న చీరెలతో కాలేజీకి వచ్చే మనోరమ, ఇవాళ ఎంతో వైభవంతో మురిసిపోతోంది. ఆరోజుల్లో ఆకాశంలో నక్షత్రంగా మెరిసిన తాను, నేడు జీవితంలో పూరిగుడిసెలో గుడ్డిదీపంలాగా వెలవెల పోతోంది.

విందు ముగిసిన తరవాత మనోరమా ఆమెభర్తా, తనూ తనభర్తా కలిసి ఫొటో తీయించుకోవాలని ఎంతో సరదాపడ్డారు. కాని నిత్యానందం అందుకు ఒప్పుకోక పోయేసరికి అందరికీ ఆశాభంగం కలిగింది. సరోజినికి పట్టలేని అక్కసు వచ్చింది. ఆ రాత్రంతా భగ్గుమంటున్న హృదయంతో మేలుకునే కూర్చుంది.

తెల్లవారగానే, పెట్టె సర్దుకుని "మానాన్నగారింటికి వెళ్తాను" అని బయలుదేరింది.

"సరే" అన్నాడు భర్త. మళ్లీ ఎప్పుడు వస్తావనికూడా అడగలేదు. నిన్నటి భర్త ప్రవర్తనతోనే గాయపడిన సరోజిని హృదయంలో, ఈమానం మరీ తీవ్ర శూలంలాగా లోతుగా గుచ్చుకుంది. ఇటువంటి మనిషి అసలు పెళ్లి ఎందుకు చేసుకోవాలి? తను ఎందుకు దీనికి అంగీకరించాలి? కాని జరిగిందాన్ని ఎవరు తప్పించగలరు? ఈ ప్రపంచంలో ముందుకి వెళ్లేదారులు ఎప్పుడూ తెరిచేవుంటయ్. కాని వెనుకడుగువేసే వీలులేకుండా ద్వారాలు వెంటనే మూసుకుపోతయ్.

ఎంత సహించినా ఓర్పుకి పరిమితి వుందికదా? అందుకే ఇవాళ సరోజిని రోషంతో పుట్టింటికి బయలుదేరింది. మళ్లీ భర్త తనకోసం కలవరిస్తూ, బతిమాలుతూ ఉత్తరం రాసేదాకా తిరిగి రాకూడదని నిశ్చయించుకుంది.

తను లేకపోతే అయినా తన విలువ భర్తకి తెలిసి వస్తుందని సరోజిని ఆశపడింది.

## 3

భర్త ఉత్తరంకోసం ఎదురుచూసి, వేసారి పోయింది సరోజిని. మనసుని ఉండబట్టలేక చివరికి తనే బయలుదేరి వచ్చింది. 'వచ్చావా ?' అని నిత్యానందం నవ్వుముఖంతో పలకరించే సరికి, సరోజిని సంతోషానికి పట్టపగ్గాలు లేవు.

వెంటనే బజారువెళ్లి ఇంట్లోకి కావలసిన సరుకులన్నీ తెచ్చి పడేశాడు. ఇదివరకు ఇంట్లో ఏదైనాలేకపోతే ఎన్నాళ్లో పోరితేగాని తెచ్చేవాడు కాడు. భర్తలో తను లేకపోవటంవల్ల మార్పు కలిగివుంటుందని సరోజిని మురిసిపోయింది. తన జీవిత కావ్యంలో నూతనాశ్వాసం ప్రారంభం అవుతుందని ఆశ పడింది.

సంక్రాంతి పండగ వెళ్లేదాకా వుండి వెళ్లమని తండ్రి ఎంత బతిమాలినా కాదని వచ్చేసింది సరోజిని. భర్త దగ్గరకు వెళ్లి వాలాలని మనసు కొట్టుకోసాగింది.

తను వెళ్లేముందు జల్లిన బంతినారు వీధిముందు ఒక తోటలాగా పెరిగి విరియపూసిన పూలతో కళ్లకి విందు చేస్తు

న్నవి. మంచుతో కలిసిన చలిగాలికి ఎత్తుగావున్న పున్నాగ కొమ్మల్లోంచి పూలు తెల్లవార్లూ రాలుతునే వున్నవి. రంగు రంగుల రకరకాల మబ్బులతో ఆకాశంకూడా బొమ్మల పేరంటం చేస్తోంది. కొత్త పంటలతోపాటు కొత్త ఆశలుకూడా మానవహృదయాల ధాన్యశాలల్లో నిండిపోతున్నయ్.

ఆ రాత్రి భర్త చదువు ముగించేదాకా నిద్రపోకూడదని సరోజిని పందెం వేసుకొని కూర్చుంది. ఎంతకీ తెమలక పోయే సరికి లైటు స్విచ్ ఆపేసింది. కిటికీలోంచి దూసుకువచ్చిన చలి గాలి సరోజిని సిగలో విరిసే బంతిపూల సువాసనని ఒక్కసారి గది అంతా వెదజల్లింది. "ఇంక చాలించ రాదటండి ఇవాళ్టికి ?" అన్నది సరోజిని లాలించే కంఠంతో.

"నేనూ అదే అనుకుంటున్నాను. కళ్లు మండుతున్నాయ్. తల నొప్పిగా వుంది." అన్నాడు నిత్యానందం.

భర్త నుదుటిమీద చెయ్యివేసి చూస్తే వెచ్చగా తగి లింది. "పదండి ఇక పడుకోండి" అని భర్త మంచంకేసి చూసి "వొళ్లు కొంకర్లుపోయే చలిలో కూడా పరుపూ దిండూ లేకుండా ఈ కొయ్య మంచం ఏమిటి చెప్పండి?" అని దీనంగా అన్నది.

నిత్యానందం కొయ్యమంచంమీదే నడుము వాల్చి పక్కన కూర్చున్న సరోజిని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని, "ఈ చలిలో చెట్లక్రింద, మెట్లమీద, వీధుల్లో అల్లాడిపోతున్న వాళ్లెందరో ఒకసారి ఆలోచించు" అన్నాడు.

"నిజమే. కాని మనకున్నంతలో మనం సుఖపడ కూడదా?" అన్నది సరోజిని.

"సుఖం ఎక్కడుంది లోకంలో? సుఖపడటానికి మితి ఎక్కడ?" అన్నాడు నిత్యానందం.

"మీరేమన్నా సరే. రేపు మంచి మంచం పరుపూ కొనితీరాలి. లేకపోతే వూరుకోను" అన్నది కొంచెం అధికారంతో.

"నువ్వు చాలా వింతమనిషిని పెళ్లి చేసుకున్నావు?" అన్నాడు నిత్యానందం.

"ఆసంగతి ఎప్పుడో తెలిసిపోయింది" అన్నది సరోజిని.

దొడ్లో సరుకుచెట్లు గాలిలో కదులుతూ, దూరపు సముద్రఘోష వినిపిస్తున్నయ్. కొమ్మలమీద కొంగలు వుండి రెక్కలు తపతప లాడిస్తున్నయ్.

"చూడండి. నామీద ఎందుకింత కోపం? నేనేం తప్పు చేశానండీ? ఎందుకిల్లా నన్ను దూరంగా తోసేసి శిక్షిస్తారు, చెప్పండీ?" అని ఎన్నాళ్ళనుంచో అణుచుకుంటున్న ఆవేదనని కంఠంలో పలికించింది సరోజిని.

కొరడాదెబ్బ తగిలినట్లు నిత్యానందం ఛటుక్కున లేచి కూచుని "ఛీ, ఇవేం మాటలు? నేను నిన్ను శిక్షించట మేమిటె, వెఱ్ఱిదానా?" అని సరోజిని తలని చేతివ్రేళ్లతో నిమిరాడు. అనుకోకుండా దొరికిన ఈచల్లని ఓదార్పుకి మూల గాలిసోకిన మబ్బులాగా ఆమె హృదయం కరిగిపోయింది.

కొనగోళ్లతో ఆమె కన్నీళ్లని తుడుస్తూ "నీకు బాధ కలిగించటం నా వుద్దేశ్యంకాదు. నీమీద నాకు ఏవిధమైన పగ లేదు. నామాట నమ్ము." అన్నాడు. అతని కళ్లలోకి చూస్తుంటే వర్షం వెలిశాక మిలమిల మెరిసే చిగురాకుల కాంతి గుర్తొచ్చింది.

అయితే మరి తన జీవితంలో ఇంత అశాంతి, అసంతృప్తి ఆవేదనా ఎందుకు ఆవరించాలి? తన కోరికలవల్లనే మనస్సింత వేదనలో వేగిపోతున్నదేమో? గాలి ఎదురైనప్పుడు తెరచాప దింపుకుని చరచరా సాగిపోయే పడవలాగా తను ఎందుకు బతకరాదు?

జీవిత సుమవనంలోని పరిమళాన్నీ మకరందాన్నీ అనుభవించటం పాపమా? అంచులదాకా నిండిన అమృతకలశాన్ని కాళ్లతో తన్నివేయటం సాధ్యమా? అనే గుంజాటనలో మనస్సు తెల్లవార్లూ తికమక పడసాగింది.

రాత్రి అంతా ఎల్లాగడచినా, తెల్లవారేసరికి మామూలు సూర్యుడే ఉదయించాడు.

"ఇవాళ సంక్రాంతి, ఏం వండమంటారు? మీకు ఏది ఇష్టమో చెప్పండి" అని అడిగిన భార్య ప్రశ్నకి ఉదాసీనంగా "ఏదైనాసరే..." అని బదులు చెప్పాడు.

"ఇవాళ నా పుట్టిన రోజు కూడాను. వుండమని మానాన్న ఎంత బతిమాలినా పెడచెవిని పెట్టి వచ్చేశాను. పండగపూటా మీరు చెయ్యి కాల్చుకోవలసి వస్తుందని వచ్చేశాను."

"ఓహో? అల్లాగా..." అని మళ్లీ పుస్తకం మీదికి వంగాడు నిత్యానందం. ఆ కంఠంలో సంతోషంకాని, సరదా కాని ఏమీ వినిపించలేదు. ఇంకో మనిషి అయితే పుట్టినరోజు కానుక తెచ్చి ఇవ్వాలని సరదా పడడూ?

చిన్నప్పటినుంచీ సరోజినికి సంక్రాంతి అంటే మహా చెడ్డ సరదా. ఇవాళకూడా తలంటి పోసుకుని, వచ్చేటప్పుడు తండ్రి యిచ్చిన కొత్తచీర కట్టుకుని సౌందర్య దేవతలాగా చిరునవ్వులతో ఇల్లంతా దీపమాలలు వెలిగిస్తూ తిరుగుతోంది. జీవితసమస్యలు కొందరి హృదయాల్లో ఉల్లాసాన్ని కుంగతియ్య లేవు. ఇవాళ సరోజిని హృదయం చెప్పలేని ఆనందంతో గంతు లేస్తోంది.

ఇది తన జీవితంలో ఇరవైమూడో పుట్టినరోజు... పెళ్లి అయి మూడేళ్లయింది... ముందు జీవితం ముసుగులు వేసుకుని దాగింది. ఇరవైఏళ్ల జీవితం సుఖస్వప్నం. ఈ మూడేళ్ల జీవితం మూడు యుగాలుగా గడిచింది. అయినా ఇకముందు తన భాగ్యరేఖ బయటపడే రోజులు మంచివి కావచ్చు. మబ్బు ఎంత నల్లటిదైనా ఆకాశంలో ఎప్పుడూ వుంటుందా?

ఇరుగు పొరుగిళ్లలో పేరంటాలకి వెళ్లి చీకటిపడు తుండగా సరోజిని ఇంటికి తిరిగి వచ్చింది. ఎదురుగా భర్త కనిపించాడు. ఎక్కడికో బయలుదేరుతున్నాడు. ఎన్నడూ ఈపాటివేళ ఇల్లుకదిలే అలవాటులేదు. ఇవాళ కాలేజీకి సెలవు కూడాను.

"నేను వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. నువ్వు భోజనం చేసెయ్యి" అని వెళ్లిపోయాడు. సరోజిని "ఎక్కడికి?" అని అడుగుదామనుకుంటుండగానే గడపదాటి వెళ్లాడు.

గడియారం పదకొండుకూడా కొట్టింది. నిత్యానందం తిరిగిరాలేదు. అల్లాగే కుర్చీలో కూచుని టేబుల్‌మీద తల ఆన్చుకుని ఎదురు చూసిచూసి ఎప్పుడో కన్నుమూసింది.

తెల్లవారుఝామున మెలకువవచ్చి ఉలిక్కిపడింది. లైటు వెలుగుతూనే వుంది. గదిలో భర్త పెట్టె కనిపించలేదు. టేబుల్ మీద తన చిరునామా రాసి అంటించిన కవరు కొట్టొచ్చినట్లు కనిపించింది.

అదే కాబోలు భర్త అందించిన సంక్రాంతికానుక!

తెగిన వీణ తీగలాగా తూలిపడింది నేలమీద సరోజిని.

## 4

"నా కోసం వెతకవద్దు. సమయం వచ్చినప్పుడు నే నెక్కడ వున్నదీ నీకు తప్పకుండా తెలుస్తుంది" అన్న వాక్యాలు సరోజిని హృదయాన్ని చీకటి వెలుగులతో నింపివేసినై.

దారాన్ని తెంపుకున్న గాలిపటంలాగా నిత్యానందం ఎక్కడికో తేలిపోయాడు. ముందుదారి ఏమిటో తోచక కూలిపోయింది సరోజిని.

సాంతం కాకుండా మధ్యలోనే ఠక్కున తెర వాలి పోయిన ఈ నాటకం ఇంకే విధంగా ముందుకు సాగుతుందో తెలియక తల్లడిల్లు తున్నది సరోజిని హృదయం.

తన మనస్సు మసక మసకగా వున్నప్పుడు, తనదారి చీకటి నీడల్లో దాగిన తరుణంలో నిత్యానందం సరోజిని మెళ్లో సూత్రం కట్టాడు. ఆ తప్పిదానికి తనని భార్య క్షమించాలిట. అడగటం ఎంత తేలిక ? కాని రక్తాశ్రువులు చిందే సరోజిని హృదయం ఆ క్షణంలో భర్తని క్షమించటం అసాధ్యం అనుకుంది. తన జీవితం బాలకుడు కొంతసేపు ఆడి దూరంగా విసిరేసిన విరిగిన బొమ్మలాగా అయిపోయింది. నవ వసంత ప్రసూనంలాటి ఆ మెజీవితాన్ని చీకటిలోకి విసిరేసి వెళ్లిపోయాడు.

పరాభవంతో గుండె మండిపోయింది. ఇంక ఏ ముఖం పెట్టుకుని తండ్రిదగ్గరికి తిరిగివెళ్లాలి ? ఏమని చెప్పుకోవాలి ? తనవల్ల తప్పేమీలేదని లోకం నమ్ముతుందా? భర్త చేసిన పనికి తనే కారణం అనదా ? దుఃఖావేశంలో దొడ్లో నూతిలోదూకి ప్రాణం తీసుకోవాలనీ, సుఖం ఎరుగని జీవితానికి మంగళం పాడాలని మనస్సు లాగింది.

కాని సరోజిని ప్రాణం అటు మొగ్గలేదు. సంసార సుఖానికి నోచుకోని ప్రతి స్త్రీ ఆత్మహత్య చేసుకోవలసిందేనా? ఇంక తనకి వేరే జీవితమార్గం లేదా ? అనే ఆలోచన మెరుపు లాగా మనస్సులో తళుక్కు మన్నది.

జీవిత సమస్యలకి మరణమే పరిష్కారం అనుకోటం వొట్టి పిరికితనంఅనిపించింది. వెంటనేపుట్టింటికి బయలుదేరిందిసరోజిని.

దుఃఖాంతంగా పరిణమించిన ఈ పెళ్ళికి తను ఎక్కువ బాధ్యుడినని తండ్రి ఎంతో విచారించాడు. మనుషుల్ని పంపికాని, ఫోటో పేపర్లలో వేయించి కాని నిత్యానందం ఎక్కడవున్నా గాలంవేసి నిలుచున్న పాళాన తీసుకురావాలనుకున్నాడు. కాని సరోజిని ఆ ప్రయత్నాలన్నీ నిష్ఫలమని చెప్పి వారించింది. ఇవాళ బలవంతాన పట్టి తీసుకొచ్చి పంజరంలో పెట్టినా మళ్ళీ ఎగిరిపోతాడు. 'నువ్వు చాలా వింత మనిషిని పెళ్ళి చేసుకున్నావు' అన్న భర్త మాటల్లో సత్యం క్షణక్షణానికీ అనుభవంలోకి వస్తోంది.

భర్తచేసిన పనివల్ల కలిగిన దుఃఖం ఒకయెత్తూ, వద్దన్నా వచ్చి పరామర్శించే వాళ్ళ ఓదార్పు మాటలు విని భరించాల్సిన బాధ ఒక ఎత్తూ! కొన్నాళ్ళపాటు మనిషి అనేవాడు కనబడని చోటికి పారిపోవా లనిపించింది. మేడమీద తండ్రి గదిలో కూచుని తలుపులు బిగించుకుంది.

కాని ఒంటరిగా వుండలేకపోయింది. నలుగురిలో నవ్వుతూ పేలుతూ విలాసంగా తిరిగే స్వభావం.

అందుకే మళ్ళీ మూడేళ్ళ తరవాత సరోజిని కాలేజీలో చేరింది. ఇప్పుడు చదువు తప్ప ఇంకో వ్యాపకం లేదు. వెల్లువలో మునిగిపోతున్న మనిషి చేతికందిన రెల్లు పరకనే గట్టిగా పట్టుకున్నట్లు, సరోజిని చదువును పంచ ప్రాణాలతోనూ పట్టుకుంది. అడుగడుగునా తూలిపోయే బాటసారికి ఏదో విడవని కేలూత దొరికినట్లుగా వుంది.

అల్లారు ముద్దుకూతురు జీవితం ఇల్లా అయిపోయిందని తండ్రి దిగులుతో కుమిలి పోయాడు. ఈ దిగులుతోనే మంచం పట్టాడు. మందులెన్ని ఇచ్చినా పనిచెయ్యటం మానివేసినయ్.

ఇక తన అవసానకాలం దగ్గర పడిందని తెలుసుకుని తండ్రి విల్లురాసి తన దగ్గర పెట్టుకున్నాడు.

తన కొడుకూ కోడలూ ఎల్లకాలం సరోజినిని సరిగ్గా చూస్తారనే నమ్మకం తండ్రికి కలగలేదు.

దారీ తెన్నూ కనపడని తన భావి జీవితాన్ని గురించి ఆలోచించి లాభంలేదని సరోజిని మనస్సంతా చదువుకే అప్ప గించింది. రోజురోజుకీ తెలియని బలం ఏదోవచ్చి మనస్సులో వేళ్లు పాతుకుంటోంది.

కాని ఏడాదికూడా కాకుండానే ఈ దిగులుతో తండ్రి పరలోకానికి వెళ్లిపోయాడు. తల క్రిందవున్న విల్లు మూలాన దుఃఖముతో నిండిపోవలసిన ఇంటిలో ప్రచండమైన తుపాను రేగింది. తండ్రి ఆస్తి అంతా స్వార్జితం. పెద్ద ఉద్యోగాలు చేసి సంపాదించిందే. కనుక విల్లుద్వారా తన ఆస్తిలో సగం వంతు కూతురికి చెందాలని వ్రాసి వెళ్లాడు.

ముందు జాగ్రత్తకోసం తండ్రి చేసిన పనివల్ల మొదటికే మోసం వచ్చింది. అన్నా వదిన కత్తికట్టి సరోజినిని ప్రబల విరోధిగా చూడటం సాగించారు. ఇంట్లో వుండటం అసాధ్యమై పోయింది. అయినా తన కెందుకీ ఆస్తి? తనకి కావలసింది ఆశ్రయం, ఆదరణ. ఈ డబ్బువల్ల అన్నకి విరోధి కావటంతప్ప తనకి ఒరిగే దేముంది?

ఆ రోజుతో తండ్రి శ్రాద్ధకర్మలన్నీ పూర్తిఅయిపోయినయ్. ఆ యిల్లు వదిలేసి అన్నా వదినా ఎక్కడికో వెళ్లిపోవాలనుకుంటున్నారని తెలిసింది. సాయంకాలం అన్న గదిలో ఒంటరిగా పచార్లు చేస్తున్నాడు. లోపలికి వెళ్లి సరోజిని "నీతో ఒకమాట మాట్లాడి పోదామని వచ్చా నన్నయ్యా?" అన్నది.

"ఏం మాట? రెండో సగంలోకూడా వాటా లేదా అని అడిగేందుకొచ్చావా?" అని క్రూరంగా అన్నాడు.

"కాదన్నయ్యా, నా మాట విను. ఇక్కడెవరూ లేరు కదా? నాకు కావలసింది నీదయ, అండ. ఇంక నాకేమి అక్కర్లేదు." అంటూ పమిట చాటునుంచి వీలునామా తీసి ముక్కలు ముక్కలుగా చించిపారేసింది.

అన్న తన కళ్లని తనే నమ్మలేక, ఆశ్చర్యంతో మాటలు తడబడుతూ "స...రో...జా!" అన్నాడు.

మధ్యలో వచ్చిన వదినగారు తన అభీష్టం అనుకోకుండా సిద్ధించి నందుకు కాళ్లు గాలిలో తేలిపోతుంటే సరోజినిని గట్టిగా కౌగిలించుకుంది.

"ఇక ప్రయాణంమాట తలపెట్టనని చేతిలో చెయ్యి వెయ్యి వదినా!" అన్నది సరోజిని.

"అబ్బే! అసలు మేము అనుకోనేలేదే!" అని అవలీలగా అబద్ధం ఆడేసింది వదిన.

అన్నయ్య ముఖం సంతోషంలో కూడా సిగ్గుపడుతున్నట్లు కనిపించింది.

# 5

అద్దం ముందు కూచుని సరోజిని తన ముఖంకేసి చూసుకుంది. తలలో అక్కడక్కడా తెల్లవెంట్రుకలు తొంగి చూస్తున్నయ్. ఒక్కొక్క ఏడాది గడుస్తున్నకొద్దీ జీవితం మరీ నిస్సారంగా కనిపిస్తుంది. ఈ ఐదేళ్లూ చదువులో మునిగి తనని గురించి ఆలోచించే తీరిక లేకుండా చేసుకుంది. ఇప్పుడు ఎం. ఏ. పూర్తిచేసి బి. ఇడి. కూడా చదివింది. ఇకముందు ఏం చెయ్యాలో అంతా అయోమయంగా వుంది.

తన నీడకేసి చూసుకుంటూ నుదుట కుంకుమ దిద్దుకుంది. నిత్యానందం తిరిగి వస్తాడనే ఆశ ఏనాడో కూలిపోయింది. కాని ఎక్కడో సుఖంగా వున్నాడనే విశ్వాసం మాత్రం మనస్సులో అల్లుకుపోయింది. అతని జీవితంలో తన బతుకు ముడిపడిపోయినా తెంపివేసుకు పారిపోయాడు. కాని సరోజిని మాత్రం అతన్ని తలవని రోజులేదు. ఏ మఠంలో అయినా కలిసి సన్యాసి అయిపోయాడేమో ! ఏ హిమాలయ గుహాలలోనో, ఏ దుర్గమారణ్యాలలోనో తపస్సు చేస్తున్నాడేమో అనిపించేది. ఆ రాత్రి గుర్తుకిరాగానే గుండె మండిపోయేది. తనని ఎందుకు లేపలేదు ! తనతో మాటమాత్రమయినా ఎందుకు చెప్పకపోవాలి ? అంత పిరికిపందలాగా ఎందుకు పారిపోవాలి ?

గడచిన అనుభవాలన్నీ నెమరువేసుకుంటూ హృదయం కొండల బరువుతో అణగిపోతోంది. తనని భర్త అర్థం చేసుకో

లేదు. అతనిని దారిని అడ్డగిస్తుందేమో అని భయపడ్డాడు. అంతటి మూర్ఖురాలా తను? చిరునవ్వుతో వీడ్కోలు చెప్పి పంపగలిగేదేమో? నన్నుకూడా నువ్వు అధిరోహించే ఉన్నత శిఖరానికి చేర్చవా అని అడిగేదేమో?

కానీ జీవితంలో వెనక్కి ఎవరు వెళ్ళగలరు? ఇష్టమైనా కష్టమైనా మెడపుచ్చుకుని కాలం ముందుకు లాక్కుపోవటం మానదు.

"ఇదిగోనమ్మా నీకేదో కవరొచ్చింది." అంటూ గదిలోకి వచ్చింది వదిన.

ఆలోచనల్లోంచి త్రుళ్ళిపడి లేచింది సరోజిని.

"మీ ఆయన దగ్గర్నుంచి ప్రేమలేఖ ఏమైనా వచ్చిందేమోనని ఇంత కష్టపడి తీసుకొచ్చాను" అన్నది వదిన పరిహాసంగా.

"కాదమ్మా వదినా! మీ అన్నయ్య అందరిలాంటి మనిషయితే నా బ్రతుకు ఈతీరు ఎందుకవుతుంది? ఈవూరి ఆడవాళ్ల కాలేజిలో లెక్చరర్ వుద్యోగం ఇచ్చాం రమ్మని రాశారు. చాలా రోజుల క్రిందట దరఖాస్తు పడేసి ఆ సంగతే మరిచిపోయాను" అన్నది. పొంగివస్తున్న ఉత్సాహంతో తన జీవితంలో కమ్ముకున్న శూన్యాన్ని ఈ ఉద్యోగం తరిమివేస్తుందని ఎంతో ఆశ కలిగిందామె.

"నీకేం తక్కువని వుద్యోగం చేస్తావమ్మా? గొప్ప ఇంట్లో పుట్టిన దానికి నీకెందుకీ దుర్బుద్ధి? అంతా మమ్మల్ని ఆడిపోస్తారు తెలుసునా?" అన్నది అయిష్టంగా.

కాని అన్నయ్య 'సరే' అనే సరికి వదిన కూడా ఒప్పుకోక తప్పింది కాదు. దారి తెలియక తిరిగి తిరిగి అలసి పోయిన బాటసారికి దూరాన పల్లెటూరి గుడిసెలో మిణుకు మనే దీపం కనపడగానే పొంగిపోయినట్లు సరోజిని సంతోష పడింది.

మర్నాడే కాలేజిలో చేరింది. అతి సాదా చీరె కట్టుకుని సామాన్య స్త్రీలాగే వెళ్లింది. ఈ అయిదేళ్ళలోనూ సరోజినికి వేషంమీద మమకారం చచ్చిపోయింది. ఇంటర్ చదివేటప్పుడు సీతాకోక చిలుకలాగా మెరిసిన సరోజినికేసి ఇవాళ చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మెళ్ళో సన్నటి గొలుసూ, చేతికి ఒకే జత గాజులు, ముఖాన ఉదయారుణ బింబంలాగా కుంకుమా, పెదవుల్లో లేత చిరునవ్వూ! మొదటిరోజు కొత్తగా బిక్కు-బిక్కు మంటున్నట్లుగా వుంది. క్లాసులో కాళ్ళూ కంఠమూ వణికి జ్వరం వచ్చినంత పని అయింది.

కాని మాష్టర్ల విశ్రాంతి గదిలో పాతస్నేహితురాలు మాధురి కనబడగానే ప్రాణం లేచి వచ్చింది. అక్కడ ఆవిడ కూడా మూడేళ్ళనుంచీ పని చేస్తోందిట. కుశల ప్రశ్నలన్నీ అయ్యాక "మీ వారు ఎక్కడున్నారు?" అన్నది మాధురి. "తెలియదు" అని చెప్పి ప్రసంగం మార్చింది సరోజిని.

"ఎంత మారిపోయావ్?" అన్నది జాలిగా మాధురి.

"నువ్వూ చాలా మారిపోయినట్లున్నావే?" అన్నది సరోజిని, మాధురి వేషం కేసి విస్తుపోయి చూస్తూ. ఇప్పుడు మాధురి చలనచిత్ర చకోరాక్షుల్ని తలతన్నేట్లుగా వుంది.

చేతులో ప్లాస్టిక్ రంగుల సంచీ, రిస్టువాచీ, చెవులకి బంగారపు చేపలరూపంలోవున్న స్టడ్సూ, పెదిమలకి లిప్‌స్టిక్కూ, శరీరాన్ని వీలయినంత నగ్నంగా ప్రదర్శించే విలువైన సిల్కుగుడ్డలూ చూసి తన కళ్ళని నమ్మలేక పోయింది సరోజిని.

ఇంతలో గంట కొట్టారు. మళ్లీ అద్దంలో ఇంకోసారి మొహానికి పౌడరు కొట్టుకొని ఎత్తు మడమల జోళ్ళని టకటక లాడించుకుంటూ మాధురి క్లాసుకి వెళ్లింది.

ఒంటరిగా మూలకుర్చీలో కూచొని దూరాన కనబడు తున్న కొండల వరసకేసి చూస్తోంది సరోజిని. చాలామంది వచ్చి కుర్చీల్లో కూచుని కబుర్లు తిరగెయ్యటం సాగించారు. ఆభరణాల్లో, అలంకరణలో ఒకళ్లని తలతన్నినవాళ్లు ఇంకోళ్లు! విజ్ఞానరంగమైన కళాశాల ఈ యువతీమణులు సౌందర్య కేంద్రంగా మార్చి వేశారా అనిపించింది.

పది నిమిషాలకే మాధురి తిరిగి వచ్చేసి, పుస్తకాలు టేబుల్ మీద గిరాటువేసి "డామిట్ మహాచెడ్డ తలనొప్పిగా వుంది" అంటూ పడకకుర్చీలో వాలిపోయింది. శలవ వచ్చిన సంబరంతో పిల్లలు కిలకిల నవ్వుతూ వెళ్ళిపోతున్నారు.

తలనొప్పి ఏమయిందోకాని మాధురి నాలుకమటుకు అలసట లేకుండా పడక కుర్చీలోంచి ఏమిటేమిటో చెప్తూను పోతోంది. తను కుటుంబానికి అంతటికీ ఆధారమట. అందుకే పెళ్ళిచేసుకోలేదుట. తగిన వరుడు ఎక్కడా దొరకటంలేదుట. సరోజిని వినటం లేదని గ్రహించి మాధురి ముఖం చిట్లిస్తూ "ఇదేమిటి? నీకు ఈ పరాకు జబ్బు ఎప్పటినుంచీ?" అన్నది.

1600
శ్రీకాకుళం



సరోజిని మనస్సు చివుక్కుమంది. దగ్గర లేకపోయినా భర్తగుణాలన్నీ ఒకటి తరువాత ఒకటి తనలో చోరబడు తున్నట్లు చాలా రోజుల్నుంచీ అనుమానంగావుంది. ఇప్పుడు మాధురి తన పరధ్యానాన్ని పట్టుకుని చూపించేసరికి బిత్తర పోయింది. పైకిమటుకు "ఏమిటి? వింటున్నాగా చెప్పు" అన్నది.

ఇక లాభంలేదని మాధురి పక్కనున్న ఇంకో యువ తితో ప్రసంగం మొదలెట్టింది. తను కార్యదర్శినిగావున్న కల్చరల్‌క్లబ్ వార్షికోత్సవం ఎంత వైభవంగా జరపాలో, ఎవ రెవర్ని పిలవాలో ఆలోచన చేయసాగింది.

కొద్దిరోజుల్లోనే ఆ వాతావరణం సరోజినికి మొహం మొత్తింది. తెచ్చిపెట్టుకున్న చిరునవ్వులూ, గాడిలో తిరిగే గానుగలాగా ఎప్పుడూ ఒకేరకం విషయాలని గురించి నడిచే సంభాషణలూ విసుగెత్తినయ్. ఎంతసేపూ ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు, చీరెలూ, సినిమాలూ వీట్లతోనే గుంటపడిన గ్రామఫోను రికార్డులాగా నడిచేవి వాళ్ళ కబుర్లు. ఎందుకో వాళ్ళంతా కాగితపు పూల మాదిరిగా కనిపించారు సరోజినికి.

తనపని తను చేసుకు పోవటానికి పూనుకున్నా వాతా వరణం ఎంతో ఇరుకుగా మురికిగా కనిపించింది. నెల తిరక్క ముందే సరోజిని రాజీనామా ఇచ్చేసింది.

"చాలా తెలివితక్కువపని చేశావ్! ఇంత కల్చరున్న కాలేజి నీకు దొరకదు" అన్నది మాధురి.

"ఈ కల్చర్‌కి ఒక నమస్కారం! నీ దృష్టిలో ఎంత ఖరీదైన సిల్కు-చీరెకడితే, ఎంత వెడల్పు మెడ జాకెట్ తొడిగితే అంత కల్చర్ వున్నట్లు దాఖలా!" అంటూ వెళ్ళిపోయింది సరోజిని.

"గుడ్‌బై! మై డియర్ నాయనమ్మా" అని నవ్వుతూ కసి తీర్చుకుంది మాధురి.

## 6

"మన వూరు వెళ్ళాలని వుందన్నయ్యా?" అని అడిగింది సరోజిని.

"దేనికమ్మా? ఆ పల్లెటూర్లో ఏం తోస్తుంది? పాత కొంప ఇవాళో రేపో పడిపోవటానికి సిద్ధంగా కూడా వుంది" అన్నాడు అన్న.

తన వుద్దేశ్యాలన్నీ చెప్పి అన్నని ఒప్పించి సరోజిని బయలు దేరింది. కూడా ముసలినౌకరు ముత్తయ్య బయలు దేరాడు.

ఏనాడో పాడుపడిన ఆ కొంపలో మళ్ళీ ఇవాళ దీపం వెలిగింది. ఊరివారందరికీ ఆశ్చర్యం వేసింది. అంత చదువుకున్న స్త్రీ ఈ మారుమూల గ్రామానికి వచ్చి తమ మధ్య జీవిస్తుందంటే మొదట్లో అందరికీ విడ్డూరంగా వుంది.

కాని వచ్చిన పదిరోజుల్లోనే అంతా సరోజినికి ఆప్త బంధువు లయిపోయారు. నోరు మంచిదైతే వూరు మంచి దవుతుందని ఊరికే చెప్పారా మరి?

క్రమంగా సరోజిని ఇల్లు ఊళ్లో పిల్ల లందరితో తేనెపట్టులాగా మోగిపోసాగింది. అక్కడే వాళ్ల చదువులూ, కేకలూ, ఆటలూ, పాటలూ! బెత్తాలు వొంటిమీద విరిగినా ఓనమాలు రానివాళ్ళుకూడా ఇట్టే అయిదుబళ్ళూ నేర్చేశారు. తోటల వెంటా, దొడ్ల వెంటా ఆగమ్మ కాకుల్లాగా తిరిగేవారందరూ వేళతప్పకుండా అమ్మగారి బళ్లోకి వెళ్ళటం సాగించారు. జీతం అడగని బడికావటం వల్ల తల్లిదండ్రులు మరీ సంతోష పడుతున్నారు.

తూనీగల్లాగా ఎగిరే పసి మనస్సులు చూస్తూ వాళ్ళ ఆటపాటలకి మురుస్తూ సరోజిని స్వప్నలోకంలో వున్నట్లుగా కాలం వెళ్ళబుచ్చుతోంది. "అమ్మగారూ?" అంటూ అస్తమానం తనచుట్టూ తిరిగే పిల్లలకంఠాలు బంగారు గంటల్లాగా మోగుతూ ఆమెలో నిద్రపోతున్న తల్లి గుండెని తట్టి లేపుతున్నయ్. ఆ పిల్లలంతా తనమీద కురిపించే అంతులేని అనురాగం, సరోజిని జీవిత కలశాన్ని అంచులదాకా అమృతంతో నింపేస్తున్నది. "ఇల్లాకాలం గడిచిపోతే నాకింకేమి అక్కర్లేదు" అనుకోసాగింది సగోజిని.

వచ్చినతరవాత అన్నగారు వందరూపాయలు పంపారు. తరవాత నెల యాభైకి, ఆ తరవాత నెల పాతికకి దిగజారిపోయింది. అన్నతో పోట్లాడి డబ్బుతెస్తానని ముత్తయ్య ఎన్నిసార్లో బయలుదేరినా సరోజిని వారించింది. "ఎంత పంపితే అంతతోనే గడుపుకుంటాను" అనేసరికి సరోజినిమీద ముత్తయ్యకి పట్టలేని కోపమూ చెప్పలేని దుఃఖమూ వచ్చినై.

ఈ పల్లెకి వచ్చాక సరోజిని కాఫీ కూడా మానివేసింది. మొదట్లో భరించలేని తలనొప్పి వేధించింది. అయినా సంకల్ప బలమే నెగ్గింది.

చెలువుకి వెళ్ళి తనే నీళ్ళు తెచ్చుకునేది. ఎవరికే ఆపద వచ్చినా వెళ్లి వారికి కొండంత సాయంచేసేది. మొదట్లో వెక్కిరించినవాళ్ళు కూడా చివరికి సరోజినిని గౌరవించటం మొదలు పెట్టారు.

ఇల్లా వుండగా ఆ వూళ్ళో డాక్టరు చైతన్యంగారి ఆసుపత్రి వెలిసింది. అతని పూర్వులది అదే గ్రామముట. ఉన్నదంతా హరించిపోతే అతని తండ్రి కుటుంబంతో వూరువిడిచి వెళ్లి పోయాడుట. చైతన్యం డాక్టర్ పాసయి యుద్ధంలో కూడా పనిచేశాడుట. హఠాత్తుగా భార్యపోవటంవల్ల బస్తీలో ప్రాక్టీసు మానేసి ఈ గ్రామానికి వచ్చి చేరాడుట.

ఈ భోగట్టా అంతా విని సరోజిని ఇతని పేరు ఎక్కడో విన్నట్లుగా వుందే అనుకుంది లోపల. ఒకరోజున ముసలి నౌకరు ముత్తయ్య ఆపుకోలేక ఎక్కడికో వెళ్లి బాగా మాంసం తిని వచ్చాడు. వచ్చి రాగానే కలరా తగిలింది. కబురు పంపగానే డాక్టరు పరిగెత్తుకొచ్చాడు. తెల్లవార్లూ హోరాహోరి వ్యాధితో పోరాడినా ఫలితం దక్కలేదు. వెళ్లిపోతూ "మీరు ఇక్కడి కెల్లా వచ్చారు ?" అన్నాడు డాక్టరు. కంఠం విని గుర్తుపట్టింది సరోజిని. ఆతను తనతో పాటే ఇంటర్ చదివిన సహాధ్యాయి అని. అంతేకాదు ఆ రోజుల్లో తనని సౌందర్య మూర్తిగా దేవీ పీఠం ఎక్కించి ఆరాధించిన భక్త కోటిలో

ఆగ్రేసరుడని! తనకి ఒక ఉత్తరం కూడా వ్రాస్తే తండ్రి కంట పడకుండా తను చదివి నవ్వుకుని చింపి పారేసిన విషయం కూడా స్మృతిలో మెదిలింది. "మీలాగే వచ్చాను!" అన్నది సరోజిని నవ్వుతూ.

తీరికగా వున్నప్పుడల్లా డాక్టరు వచ్చి పోతూ వున్నాడు. "నిత్యానందం మాష్టరుగారిని పెళ్లాడటమే నీది పెద్ద పొరపాటు" అన్నాడు ఒక రోజున.

"ఎందుకని? నేను మట్టుకు అల్లా అనుకోను" అని కష్టం కలిగినట్లు సరోజిని సమాధానం చెప్పేసరికి చైతన్యం చకితుడై పోయాడు. ఈ విషయం ఎత్తటమే తన పొరబాటను కుని వెళ్లిపోయాడు.

కాని ఆ రాత్రంతా ఇదే ఆలోచిస్తూ కూచున్నాడు. ఇన్ని కష్టాలకి గురిచేసినా భర్తమీద ఈగ వాలనివ్వ దేమిటి? ఇంత చదువుకున్న స్త్రీకి ఈ మూర్ఖమైన పతిభక్తి యేమిటి? ఎంత చలాకీ, శంపాలతలాగా కళ్లని మిరుమిట్లు గొలిపే సరోజిని ఎల్లా మారిపోయింది? ఈ మారుమూల పల్లెటూళ్లో, నా అనేవా రెవరూ లేనిచోట, మాసిన గుడ్డలతో దీనంగా జీవించటం చూస్తే చైతన్యానికి గుండెల్లో శూలంపెట్టి పొడిచి నట్లనిపించింది. ఆమె అందం, యావనం అడివిని కాసిన వెన్నెలలై పోయినయ్. ఆమె చదువంతా ఈ పల్లెటూరి వీధి బళ్లో బూడిదలో పోసిన పన్నీరై పోతోంది. ఏ ఆశతో జీవి స్తోంది? నిత్యానందం మాష్టారివల్ల తను పడిన సుఖ మేమిటి? ఆయన తిరిగి వచ్చే మనిషి కాదని తెలియదా?

గోడమీద వేలాడుతున్న ఫోటోలో విద్యార్థిని దశలో ముందు వరసలో కూచున్న సరోజిని ముఖం కనిపించింది. కలెక్టరుగారి కూతురు మళ్ళా ఏ కలెక్టరునో, జడ్జీనో పెళ్ళాడి జీవితం మూడు పూలూ, ఆరు కాయలూ, కాచినట్లు గడిపేస్తుం దని అంతా అనుకునేవాళ్ళు. కాని జరిగిందేమిటి ? జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికైనా మించి పోయిం దేముంది ? ఈ ప్రవాసం నుంచి సరోజినిని తను తప్పించాలి. ఆమె జీవితం నందనవనం లాగా విరిసేట్లు చేయాలి. ఎల్లాగైనా ఈ పరిస్థితి నించి రక్షించాలి అని అనుకుంటూ కళ్లు మూశాడు.

నిర్మలంగా వున్న ఆకాశంలో చరచరా జారిపోయే నక్షత్రాలు దూసుకుపోయినయ్.

చైతన్యాన్ని చూసేసరికి సరోజిని మనస్సు తలకిందులై పోయింది. గతమంతా ఒక్కసారి కళ్ళలో జిగేలు మన్నది. తన చేతికి అందని ఆనందస్వప్నం, తనకి దూరమైపోయిన ప్రేమస్వర్గం అల్లంత దగ్గరగా దిగివచ్చి "లే, అందుకో !" అన్నట్లుగా తోచింది.

నిత్యానందం ఫోటోకేసి చూస్తూ కళ్ళుమూసుకుంది. . . కాని చైతన్యం, ముఖమే కనిపించి తన మానస సరోవరంలో రాళ్ళు విసిరి కల్లోలం రేపుతోంది. "ఈ రాత్రి యిక తెల్ల వారదా ?" అనుకుంటూ లేచి పచార్లు చేసింది.

గుడిదగ్గర హరికథ మధ్య మధ్య గాలిలో తేలివస్తోంది. పొలాలలోంచి కీచురాళ్ళ అరుపులు, మధ్యమధ్య నక్కల కూతలూ వినిపిస్తూ నిశ్శబ్దాన్ని చీలుస్తున్నయ్.

సరోజిని దీపం వెలిగించి పుస్తకం తెరిచింది. మనస్సు గాలికి కొట్టుకునే దీప శిఖలాగా తన్నుకుంటోంది. కళ్ళముందు శోకమూర్తి యశోధర... "లేపనైనా లేపలేదే? మోము చూపనైనా చూపలేదే?" దీనమైన విలాపం... తనని అడుగు అందని చీకటి బావిలో వదిలేసి వెళ్ళిపోయిన భర్తని తలుచుకో గానే మనస్సు ఉడికిపోతున్నది. యశోధరకి కష్టాలను మరపించే ఆశాంకురం రాహులుడున్నాడు. మరి తనకి ఆసరా ఏముంది?

వెన్నెట్లో తెరచాపలెత్తి ఏటిమీద పడవ తేలి పోతోంది. పల్లెవాళ్లు—

"పోటూ పాటుల్ల యేరూ
పొంగీ పొరిలేకాడ
రావోయి సిన్నవోడ! మావోడ!"

అని పాడే పదం చెవుల్లో గింగురుమంటోంది.

## 7

ఇట్టే ఆకాశానికి ఎత్తిన లోకమే నిమిషంలో అట్టడుగుకి తొక్కివేస్తోంది.

చెఱువు రేవులో ఆపేక్ష ఒలకపోసినవాళ్లే ఇప్పుడు మూగనోము పట్టారు. చెప్పుకుంటున్న గుసగుసలు సరోజిని వచ్చేసరికి కట్టిపెట్టేసి గప్‌చుప్‌గా ఇళ్ళలో పనులు మునిగి పోతున్నవనే సాకుతో దూసుకుంటున్నారు.

పిల్లల కిలకిలతో మోగిపోయిన చెట్టుకొమ్మలు మోడు వారి మూగపోయినట్లు సరోజిని ఇల్లంతా చిన్న బోయింది.

పసిపాపలకి కూడ పనికిరాని పాపం తను ఏం చేసిందో తెలియక సరోజిని మనస్సు కలతపడింది. ఎక్కడ చూసినా మూతి విరుపులూ ముక్కు విరుపులూ !

ఊరివారి ఆకస్మిక వైరానికి కారణం ఒక్కటే కనిపిస్తోంది. తను చైతన్యంతో కులాసాగా కబుర్లు చెప్పటం. తన యింటికి తరుచు అతను వస్తూపోతూ వుండటం. బస్తీలో పుట్టి పెరిగిన సరోజినికి వీటిలో తప్పేమీ కనిపించటంలేదు. కాని గోరంతలు కొండంతలుచేసి, ఇదిగో పులి అంటే, అదుగో తోక అనే పల్లీయుల దృష్టిలో, ఎంత విడ్డూరంగా కనబడుతుందో గ్రహించలేక పోయింది.

అయినా సరోజిని చలించలేదు. తన మనస్సే తనకి సాక్షి. తను చేసిన తప్పిదమేమీ లేదని తెలుసుకున్నాక సరోజిని వాళ్ల విరోధాన్ని గడ్డిపరకలాగా ఎగరకొట్టేసింది.

ఆ రాత్రి చాలా పొద్దుపోయేదాకా చదువుకుంటూ కూచుంది. దగ్గరకి వేసిన తలుపు తోసుకుని చైతన్యం లోనికి వచ్చాడు. ఆ వేళప్పుడు వచ్చినందుకు సరోజిని ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయింది.

"నీతో ఒక మాట చెప్పాలని వచ్చాను."

"పోనీ రేపు చెప్పకూడదా ?" అన్నది సరోజిని.

"కాదు. తెల్లారకముందే నే నీ వూరినించి వెళ్ళిపోతున్నాను. అందుకే ఇప్పుడు వచ్చాను" అని కొంచెంసేపు ఆగి మళ్ళీ అందుకున్నాడు.

"ఈ మురికి కూపంలో మనం నిమిషం కూడా వుండ

లేము. ఈ రాత్రే వెళ్ళిపోదాం-రా"

"ఎక్కడికి ?"

"ఇక్కణ్ణుంచిబైటపడ్డాకఆలోచించుకోవచ్చుఆసంగతి."

"ఎందు కంత కోపం ఈ వూరిమీద ?"

"కోపం కాక యేమిటి ? నా చెవులతో విన్నాను ఈ మాటలు.

"ముత్తయ్య మనకి అడ్డంగా వుంటాడని వాణ్ని మనం విషంపెట్టి చంపామట. ఇంతకంటే అన్యాయం వుందా ?"

"అయితే ఇద్దరం కలిసి పారిపోతే వాళ్ళ అనుమానాలని రుజువు చేసినవాళ్ళం కామా ?"

"మరి ఏం చెయ్యటం ? ఇక నేను లోకానికి జంకను."

"మీ వుద్దేశ్యం ఏమిటో తెలియటంలేదు."అన్నది సరోజిని.

"అది తెలియజెప్పాలనే వచ్చాను. ఇన్నాళ్ళనుంచీ నాకు ధైర్యం చాలలేదు. ఇవాళ అటో యిటో తేల్చుకోవాలనే వచ్చాను. తిరిగిరాని నిత్యానందం మాష్టారికోసం నువ్వు జీవితమంతా ఇల్లా పాడుచేసుకోటం బాగాలేదు. నేనూ వొంటరివాడినయి పోయాను. మన ఇద్దరం కలిసి జీవితంలో కొత్త అధ్యాయం ఆరంభిద్దాం. ఈ నికృష్ట పరిస్థితిలోంచి బైట పడటానికి ఇదే ఆఖరి అవకాశం నీకు. జారవిడిస్తే తిరిగి ఎప్పటికీ దొరకదు..." అని ఎంతో సేపటినుంచీ వల్లించిన పాఠం లాగా అనేసి దిక్కులు చూడటం మొదలుపెట్టాడు.

సరోజిని పిడుగుదెబ్బ తిన్నదానిలాగా కూలబడి పోయింది. నోటిమాట పెగిలిరావటంలేదు. గుండెల్లో దైన్య

పరిగెడుతున్నయ్. "ఈ మాట చెప్పటానికేనా ఇంత రాత్రివేళ వచ్చారు ?" అన్నది ఎంతో బాధగా. కాని వ్యాళ్లో ఆత్మీయుడుగా మెలుగుతున్న డాక్టరు చివరికి ఇల్లా తన అసలు రంగు బైటపడేసుకుంటాడని అనుకోలేదు.

ఎగురుతున్న పురుగు దీపం మంటలోకి దూకి మాడిపోయింది. గోడమీద బల్లి ఒకపురుగుని పట్టుకుని చరచరాపాకి వెళ్ళింది. "నీ సమాధానం విని కాని నే నిక్కడనుంచి కదలను" అని డాక్టరు దారికి అడ్డంగా నిలబడ్డాడు.

"అయితే మీరు వచ్చినదారినే తిరిగివెళ్ళవచ్చు. నేను వ్యక్తిత్వం గల స్త్రీని. నాకు వివాహం జన్మలో ఒక్కసారే ! నన్ను గురించి మీరు పొరబడ్డారు. మీ సానుభూతికి కృతజ్ఞురాలిని. ఇటువంటిమాటలు మీ నోట వినుట నా దురదృష్టం" అంటుంటే కన్నీళ్ళతో కంఠం జీరవోయింది.

"నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను సరోజా !" అని సరోజినిముఖంకేసి చూశాడు. కళ్లు జ్వాలల్లాగా భీకరంగా కనిపించి కంపించాడు.

"నాకు ప్రేమ అక్కర్లేదు. ఆ స్వర్గద్వారాలు ఏనాడో మూసుకుపోయినయ్. నేను ఇల్లా బ్రతకటంకూడా మీకు ఇష్టంలేదా ?" అని వణికే కంఠంతో ప్రశ్నించేసరికి చైతన్యం కంపించిపోయాడు. తను కాలేజీలో ఎరిగున్న సరోజినికీ ఇప్పుడు తనముందున్న వ్యక్తికీ ఎంతో గొప్ప తేడా వుంది ! తన ఊహాకి అందనంతటి ఉన్నత శిఖరంమీద నిలబడివుంది సరోజిని. అక్కడ నిలబడలేక గిర్రున వెనక్కి తిరిగాడు.

ఆకాశంలో చందమామకి అడ్డువచ్చిన నల్లమబ్బు అ వెన్నెట్లో కరిగి తనే కాంతిపుంజంగా మారిపోయి మెరిసింది. చూస్తూ చైతన్యం ముగ్ధుడైపోయాడు. ఇంటిదారి పట్టాడు.

## 8

పంపిన మనియార్డరు తిరిగి వచ్చేసరికి అన్నగారు ఖంగారు పడ్డాడు. సరోజిని ఏమయిందో తెలియక ఆ రోజే పల్లెటూరికి వెళ్ళాడు. అక్కడి వాళ్ళంతా సరోజిని అన్నగారి వూరు చేరివుంటుం దనుకొన్నారు.

అందరికంటే డాక్టరు చైతన్యం ఈ సంగతి విని మరీ గిల గిల తన్నుకున్నాడు. తన ప్రయాణం సంగతి శుద్ధ అబద్ధం. అక్కడే వుండిపోయాడు. సరోజినిమీద ఒక పాచిక వేసి పారుతుం దేమో నని చూడటానికే తను తెల్లారి వూరువిడిచి పోతున్నా నన్నాడు. కాని సరోజిని ఇలా చేస్తుందని కలలో కూడా అనుకోలేదు.

ఆ రోజు పేపర్లోనే నిరంజనానందస్వామి ఫోటోపడింది. ఒక అరణ్య ప్రాంతంలో ఆశ్రమం నెలకొల్పాడని, భక్తులతో, శిష్యులతో అదొక పుణ్యక్షేత్ర మయిందనీ రాశారు. చూడ గానే ఆ ముఖంలో నిత్యానంద కవళికలు, బాగా పెరిగినమీసం, గడ్డంలోంచి తొంగిచూస్తున్నయ్. ఒక్కరోజు ముందు ఈవార్త తెలిసివుంటే సరోజిని ఎంత పొంగిపోయేదో అనుకొని చైతన్యం కుంగిపోయాడు. ఇప్పుడైనా మునిగిపోయింది లేదు. తను అక్కడికి రెక్కలు కట్టుకుని వెళ్ళి "ఓ స్వామీ! నీ భార్యే

నిన్ను ఓడించింది" అని చెప్పాలనిపించింది. ఆ రాత్రి తను అన్న మాటలవల్లనే. సరోజిని ఇల్లా అంతర్థానమై పోయిందని చైతన్యం హృదయం ఒక్క వరసన వేదిస్తోంది. ఎక్కడున్నదో వెతకాలి. భర్త జాడ తెలపాలి. క్షమాభిక్ష వేడుకోవాలి. అప్పటికి కాని నిద్ర పట్టదు. అప్పుడే బయలుదేరాడు.

ఆశ్రమం మనోహరంగా వుంది. మామిడి గుబుర్లలో కోకిలలు కొసరి కొసరి కూస్తున్నయ్. ఒక చెట్టుకింద ధ్యాన ముద్రలో నిరంజనానందస్వామి కూచున్నాడు. పద్మాసనాలు వేసుకొని శిష్యులు కూచున్నారు, ఆయన కళ్ళు తెరవటం కోసం ఎదురుచూస్తూ. అంతా నిశ్చల నిశ్శబ్దం.

ఆశ్రమ ద్వారం దగ్గర ఎవరిదో శరీరం మాసి దుమ్ము కొట్టుకున్న గుడ్డలు. ఎన్నాళ్ళో ఆకలి బాధతో శుష్కించిన ముఖం. దీర్ఘప్రయాణ ప్రయాసతో తుది ఊర్పు విడుస్తున్న ప్రాణం. లోపలికి వెళ్ళబోతుంటే చల్లగా కాళ్ళకి తగిలి ఉలిక్కిపడి "స...రో...జి...నీ" అని ఒక్క శోకం పెట్టాడు చైతన్యం...ఎల్లా చేరిందో ప్రాణాన్ని బిగబట్టుకొని? వొళ్లు చల్లగా తగిలింది.

కేక విని ద్వారం దగ్గరికి పరిగెత్తుకొచ్చిన ఆశ్రమ వాసులు ఈ దృశ్యంచూసి విస్తుపోయారు.

స్వామి కళ్ళలోంచి రెండు అశ్రుబిందువులు జారి అభాగిని సరోజిని నుదుటిమీద కుంకుమలో కలిసినై.

చెట్ల గుబుర్లలో మిణుగురులు తళుక్కు మన్నయ్.